

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో ఎరువుల కోసం ధర్నా చేస్తున్న రైతులు

అన్నదాత ఆగ్రహం

- యూరియా కోసం రాస్తారోకోలు
- మద్దతు పలికిన బీఆర్ఎస్ నాయకులు
- పోలీసు బందోబస్తు మధ్య పంపిణీ
- మిగిలిన రైతులకు టోకెన్లు అందజేత

7

పింఛన్ల పంపిణీకి ముఖ గుర్తింపు

- బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు మొబైల్ ఫోన్లు
- వనపర్తి జిల్లాలో 73 మందికి అందజేత



పామిరెడ్డిపల్లిలో పింఛను కోసం ఫోన్‌లో వికలాంగుని ఫేషియల్ రికగ్నిషన్ చేస్తున్న బీపీఎం



వనపర్తి : రాయిగడ్డలో పూజలు అందుకుంటున్న వినాయకుడు

పార్వతీ తనయా.. పాహిమాం

6

చాక్‌పీస్‌కూ డబ్బుల్లేవ్!

సర్కారు బడుల నిర్వహణకు నిధులివ్వని ప్రభుత్వం

- మూడు నెలలుగా ప్రధానోపాధ్యాయుల ఇబ్బందులు
- చాక్‌పీస్‌లు, ఇతర పనులకు జేబులోంచి ఖర్చు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,956 పాఠశాలలు
- రావాల్సిన నిధులు రూ.8.18 కోట్లు



పాలమూరు పట్టణంలోని షాషాబ్ గుట్ట పాఠశాల

పాఠశాలలకు రావాల్సిన నిధులు

విద్యార్థుల సంఖ్య	ఏటా రావాల్సిన నిధులు (రూ.ల్లో)
30 లోపు	10,000
31 నుంచి 100	25,000
1001 నుంచి 250	50,000
251 నుంచి 1000	75,000

త్వరలో విడుదల

ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలల నిర్వహణ కోసం నిధులు మంజూరు కాలేదు. అందుకోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నిధులు లేక ప్రధానోపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నది వాస్తవమే. నిధులను ప్రభుత్వం త్వరలోనే విడుదల చేసే అవకాశం ఉంది.

- దుంకుడు శ్రీనివాస్, ఏఎంవో మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, బోధన సజావు సాగేలా సంస్కరణలు తెస్తున్నా బడుల నిర్వహణకు ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పాఠశాలలకు నయా పైసా ఇవ్వలేదు. దాంతో చాక్‌పీస్ నుంచి చిన్న పనులు చెయ్యడానికి హెచ్‌ఎంలు తమ జేబులోంచి ఖర్చు చేయాల్సి వస్తోంది.

నిధుల కోసం హెచ్‌ఎంల ఎదురుచూపు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,956 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. రెండు లక్షలకుపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం నుంచి రూ.8.18 కోట్ల నిధులు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు రాలేదు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలకు నిధులు కేటాయిస్తారు. ఆ నిధులతో స్టేషనరీ, ప్రయోగశాలల సామగ్రి కొనుగోలు, వివిధ కార్యక్రమాలు నిర్వహణ తదితర బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు నిధులు రాకపోవడంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం సంగం నిధులైనా మంజూరు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని అంటున్నారు.



గద్వాల రైల్వేస్టేషన్ వద్ద మొక్కను నాటుతున్న డీఆర్ఎం

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

- రైల్వే డీఆర్ఎం సంతోష్‌కుమార్ వర్మ

గద్వాల అర్బన్/అలంపూరు చౌరస్తా, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అమృత్ రైల్వే పథకంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం సంతోష్‌కుమార్ వర్మ ఆదేశించారు. సాధారణ తనిఖీలో భాగంగా మంగళవారం డీఆర్ఎం గద్వాల రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేశారు. ఇక్కడ కొనసాగుతున్న పనులను పరిశీలించారు. స్టేషన్ సమీపంలో నిర్మించిన అధికారుల విశ్రాంతి భవనాన్ని డీఆర్ఎం ప్రారంభించి సమీపంలో మొక్కలు నాటారు. స్టేషన్ వెలుపల ప్రవేశ ముఖద్వారం, నాలుగులైన్ల రోడ్డు పనులు, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. అంతకు ముందు రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు, కర్నూలు విభాగం డివిజన్ అధ్యక్షుడు శంకర్ డీఆర్ఎంను సత్కరించారు. తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఉండవల్లి మండలంలోని రూ.10కోట్లతో నిర్మిస్తున్న జోగుళాంబ రైల్వేహాల్ట్ పనులను పరిశీలించారు. డీఆర్ఎం వెంట రైల్వే శాఖ వివిధ విభాగాలకు చెందిన ఇంజనీర్లు, అధికారులు అరుణ్ కుమార్ శర్మ, కిరణ్‌కుమార్, సృజన్‌కుమార్, సురేష్ కుమార్ ఉన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి
- నేడు మూసాపేటకు రానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అధికారులతో కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి సమీక్ష
- బందోబస్తుపై సూచనలు



మూసాపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మూసాపేట మండలం వేముల కోజెంట్ ఫార్మా కంపెనీలో రెండో యూనిట్‌ను సీఎం బుధవారం ప్రారంభించనున్నారు. పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే, కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి మంగళవారం పరిశీలించారు. కంపెనీలో సీఎం ప్రారంభించే యూనిట్‌ను, ఇతర ఏర్పాట్లు, హెలిప్యాడ్ స్థలాన్ని ఎమ్మెల్యేపరిశీలించి, అధికారులతో మాట్లాడారు. ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని చెప్పారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తనివ్వొద్దని చెప్పారు.

అధికారులతో సమీక్ష

సీఎం పర్యటన నేపథ్యంలో కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి బుధవారం శాఖల అధికారులతో సమీక్ష చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ అంబులెన్స్‌లు, అగ్నిమాపక శాఖ తమ వాహనం సిద్ధంగా ఉంచాలన్నారు. హెలీప్యాడ్ స్థల, మీటింగ్ ఏర్పాట్లు పర్యవేక్షించి, అధికారులకు సూచనలు చేశారు. వారి వెంట అదనపు కలెక్టర్లు, ఆర్డీవో, డీఎస్పీ ఉన్నారు.

956 మందితో పోలీసు బందోబస్తు

మహబూబ్‌నగర్(ఆంధ్రజ్యోతి): సీఎం మూసాపేట పర్యటన సందర్భంగా 956 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. వేముల కోజెంట్ పరిశ్రమ పరిసరాలను డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లతో తనిఖీ చేశారు. పార్కింగ్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీ జానకి మంగళవారం పరిశ్రమ ప్రాంగణాన్ని, పరిసరాలను పరిశీలించారు. బందోబస్తుపై పోలీసులకు దిశానిర్దేశం చేశారు. అక్కడే బందోబస్తు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశం అయ్యారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ట్రాఫిక్ నియంత్రణ, వీఐపీ రాకపోకలు, భద్రతా చర్యలు పటిష్ఠంగా చేపట్టాలని చెప్పారు. బందోబస్తులో ఇద్దరు ఎస్పీలు, ఒక అదనపు ఎస్పీ, ఐదుగురు డీఎస్పీలు, 27 మంది సీఐలు పాల్గొననున్నారు. వారితో పాటు 69 మంది ఎస్ఐలు, 173 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 461 మంది కానిస్టేబుళ్లు, 129 మంది మహిళా కానిస్టేబుళ్లు, మహిళా హోంగార్డులు, 89 మంది హోంగార్డులు బందోబస్తులో పాలుపంచుకోనున్నారు.

ఓటరు తుది జాబితా రెడీ

పంచాయతీల ఓటరు లిస్టును ప్రదర్శించిన అధికారులు

- గద్వాల జిల్లాలో 3,93,418 మంది..
- వనపర్తి జిల్లాలో 3,82,295 మంది..
- నాగర్‌కర్నూల్ జిల్లాలో 6,47,342 మంది ఓటర్లు

గద్వాల/వనపర్తి రాజీవ్ చౌరస్తా/ కందనూలు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాల్లోని అన్ని గ్రామ పంచాయతీలలో మంగళవారం ఓటరు తుది జాబితాను అధికారులు ప్రదర్శించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం ఓటర్లు 3,93,418 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,93,627మంది, మహిళలు 1,99,781 మంది, ఇతరులు 10మంది ఉన్నారు. జిల్లాలోని 13 మండలాల్లో 255 గ్రామ పంచాయతీలు ఉండగా వీటిలో 2,390 వార్డులు ఉన్నాయి. మొత్తం పోలింగ్ స్టేషన్లు 2,390 ఏర్పాటు చేశారు. 13 జడ్పీటీసీ స్థానాలు ఉండగా 143 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. అదేవిధంగా వనపర్తి జిల్లాలో 268 గ్రామ పంచాయతీను 2,436 వార్డులుగా విభజించి నట్లు డీపీవో రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. పురుష ఓటర్లు 1,90,068 మంది, మహిళా ఓటర్లు 1,92,223 మంది, ఇతరులు నలుగురు ఉన్నట్లు తెలిపారు. మొత్తం జిల్లాలో 3,82,295 మంది ఓటర్లు ఉన్నట్లు అయన పేర్కొన్నారు. అలాగే 2,436 పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఓటర్ల తుది జాబితాను విడుదల చేసినట్లు ఇన్‌చార్జ్ డీపీవో శ్రీరాములు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 460గ్రామ పంచాయతీలకు గాను 455 గ్రామ పంచాయతీల ఓటర్ల తుది జాబితాను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. మిగిలిన ఐదు గ్రామ పంచాయతీల తుది సవరణలు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 6,47,342 మంది ఓట్ల జాబితాను విడుదల చేశారు. మహిళలు 3,24,316, పురుషులు 3,23, 015మంది, ఇతరులు 11 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 4,102 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

వనపర్తి డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లే శ్రీనివాసులు

7

కేసీఆర్‌పై నిందలు వేస్తే సహించం

- రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- యూరియా కొరతకు నిరసనగా బీఆర్ఎస్ భారీ ర్యాలీ



నాగర్‌కర్నూల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాలన చేత కాక ఇతరులపై నింద మోపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దుయ్యబట్టారు. మంగళవారం మధ్యాహ్నం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎరువుల కొరత, కాళేశ్వరంపై అనవసరమైన నిందలను కేసీఆర్‌కు అంటగడుతున్నారని నాగర్‌కర్నూల్ పట్టణంలోని అంబేడ్కర్ కూడలి ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణకు ప్రయోజనం చేకూర్చే కాళేశ్వరం ప్రాజెక్టును సమాధి చేసి ఆంధ్రాకు నీళ్లందించే ప్రయత్నాన్ని ముఖ్యమంత్రి కొనసాగిస్తున్నారని అన్నారు. రాష్ట్ర సాధనోద్యమంలో కీలక భూమిక పోషించిన కేసీఆర్‌పై నిందలు వేస్తే సహించబోమని ఆయన మండిపడ్డారు.

మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే కుట్రపూరితమని, కాళేశ్వరం అంటే మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంపుహౌజ్‌లు, 203 కిలోమీటర్ల సొరంగం, 1,531కిలో మీటర్ల గ్రావిటీ కెనాల్, 141 టీఎంసీల స్టోరేజీ సామర్థ్యం అని కేవలం 3 పిల్లర్లు కుంగితే ఇంత పెద్ద ప్రాజెక్టు పట్ల దుష్ప్రచారం చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. తెలంగాణ సమాజానికి ఎవరూ దోహదపడ్డారో.. గోదావరి జలాలను ఆంధ్రాకు తరలించడానికి ఎవరు ప్రయత్నిస్తున్నారో ప్రజలు తెలుసుకోలేని స్థితిలో లేరని అన్నారు. త్వరలోనే అందరి బండారం బయటపడితుంది. అప్పుడు మొహం ఎక్కడ పెట్టుకుంటారో చూస్తామని అన్నారు.

ఇక్కడి ప్రజలు తిరస్కరించింది మరిచారా?

- ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గద్వాల ప్రజలు తిరస్కరిస్తే మీరు ఇతర ప్రాంతంలో గెలిచి ఇక్కడి అభివృద్ధిని ఎండగడితే సహించేది లేదని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు తాజా మాజీ ప్రజాప్రతినిధులు ఏదో పబ్బం గడుపుకోవడానికి ఇక్కడికి వచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. మీరు మీ స్వార్థం కోసం పదవిని వాడుకున్నారే కానీ ఎక్కడా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. ఇక్కడి ప్రజలు మిమ్మల్ని తిరస్కరించిన విషయం మరిచారా అన్నారు. మీరు ఇక్కడికి చుట్టపుచూపుగా వస్తున్నారని, ఇక్కడే స్థానికంగా ఉండి ప్రజలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని అన్నారు. తాను ఏడు సంవత్సరాలలో ఎంత అభివృద్ధి చేశానో అంకెలతో సహా చూపిస్తానని, మీరు 15 సంవత్సరాలలో చేసిన అభివృద్ధిని చూపాలని సవాల్ విసిరారు. ప్రతిపక్ష నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలన్నారు. అభివృద్ధి పనులను అటంకపరిచేలా చేస్తున్నారని, అన్నింటిని అధిగమించి ప్రజల సమస్యలను పరిష్కారమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. సమావేశంలో మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ బాబర్, మాజీ కౌన్సిలర్లు నాగిరెడ్డి, మురళీ, శ్రీను ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

అచ్చంపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంచాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీహెచ్‌సీ సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. అనంతరం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. భూ భారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతీ దరఖాస్తుపై సమగ్ర పరిశీలన చేసి శాశ్వత పరిష్కారాన్ని చూపేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. మండలంలో మొత్తం 652 దరఖాస్తులు రాగా ఇప్పటివరకు కేవలం 82 దరఖాస్తులు మాత్రమే పరిష్కారం అయ్యాయని, మిగతావి ఎందుకు పరిష్కారం కాలేదని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మాధవి, తహసీల్దార్ పాండు నాయక్, డీటీ కృష్ణాజీ, ఆర్ఐ అనిల్ ఉన్నారు.



లింగాల సీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- డీఐజీ ఎల్ఎస్ చౌహాన్
- ఆత్మకూర్, మదనాపురం పోలీస్ స్టేషన్లు తనిఖీ

6



హామీలు అమలు చేయని కాంగ్రెస్

- రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడిన రాణీరుద్రమ



దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ

వెల్దండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధిలేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ అన్నారు. మండలంలోని కుప్పగండ్ల గ్రామంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ఆరుగ్యారెంటీలు, 420 హామీలు అమలు కోసం చేపట్టిన నిరాహార దీక్షను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు అబద్ధపు హామీలు ఇచ్చి కనిపించిన దేవుళ్లపై ఒట్టువేసి గెలిచిన కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక పాలనను గాలికొదిలేసిందని అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు కేంద్రం అడ్డుపడుతోందని ఆరోపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ఎవరు అడ్డుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆచారి మాట్లాడుతూ అబద్ధపు హామీలు ఇచ్చిన ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. నిద్రపోతున్న ప్రభుత్వాన్ని మేలుకొలిపేందుకే గ్రామాలలో నిరాహార దీక్షలు చేపట్టామని అన్నారు. కుప్పగండ్ల పంచాయతీలోని 1,800 ఎకరాల గిరిజనుల భూములకు నేటికీ పట్టాలు ఇవ్వలేదని, ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే అనుచరులు సంబంధిత పేదల భూములను కొల్లగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, నాయకులు మట్ట శారదమ్మ, మోహన్‌రెడ్డి, సుబ్బయ్యగౌడ్, పరమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...

ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.

మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259

నాగర్‌కర్నూల్ : 9985410905

వనపర్తి : 9985403242

గద్వాల : 9985403238

నారాయణపేట : 9985411463

మరిన్ని వివరాలకు సంప్రదించండి

9985411365



వనపర్తి పట్టణంలోని బ్రహ్మంగారి ఆలయం ఆవరణలో...



పేట సుభాష్‌రోడ్‌లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శంకరుడి ఆకారంలో భారీ వినాయకుడి విగ్రహం



పేటలో పళ్ల యువ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన భారీ వినాయకుడు



పేటలో వివిధ తినుబండారాలతో వినాయక ఆకారం



పేటలో భగత్‌సింగ్ వినాయక మహిళా సంఘం ఆధ్వర్యంలో 33 రకాలతో సమర్పించిన నైవేద్యం



వనపర్తి జిల్లా కేంద్రంలోని సంత బజార్‌లో ఆకర్షణీయమైన డెకరేషన్‌తో గణపయ్య


వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ముందు పూజలందుకుంటున్న భారీ గణనాథుడు

పార్వతీ తనయా పాహిమాం..

పార్వతీ తనయా పాహిమాం.. అంటూ భక్తులు నిత్యం భక్తిప్రపత్తులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ఆకారాలతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాల్లో బంధించింది. కాగా గణేష్ ఉత్సవాల్లో భాగంగా నారాయణపేటలో భగత్‌సింగ్ వినాయక మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి 33 రకాల పదార్థాలను గణనాథుడికి నైవేద్యంగా సమర్పించారు.

- నారాయణపేట/వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆంధ్రజ్యోతి

అధిక తేమతో

పంటల దిగుబడి తగ్గే ప్రమాదం

- పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శంకర్


ఇంద్రకల్ గ్రామ శివారులో వరి పంటను పరిశీలిస్తున్న పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

తాడూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 20 రోజులుగా నిరంతరాయంగా కురుస్తున్న వర్షం కారణంగా అన్నదాతలు సాగు చేసిన పత్తి, వరి పంటలకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇంద్రకల్ గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో అధిక తేమ కారణంగా పంట పూర్తిగా పసుపు రంగులోకి మారి గూడ, పూత, పిందె రాలిపోవడంతోపాటు కాయలు మురిగిపోతున్న పరిస్థితి నెలకొంది. రైతులు పత్తి పంటలో నిల్వ ఉన్న నీటిని వెంటనే తీసేయాల్సిందిగా సూచించారు. అదేవిధంగా వరి పంటకు సంబంధించి చీడపీడలు ఆశించే సమయం ఆసన్నమైందని, రైతులు స్థానికంగా ఉండే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి సస్యరక్షణ చర్యలు తీసుకున్నట్లయితే చీడపీడల బెడదను అధిగమించి పంటలను కాపాడుకోవచ్చన్నారు. పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు విద్యారాణి, శ్రీరామ్, శోభరాథోడ్, ఏఈవో శ్రీకాంత్, పాలెం కృషి విజ్ఞాన కేంద్రం రావేఫ్ విద్యార్థులు, గ్రామానికి చెందిన అన్నదాతలు పాల్గొన్నారు.

పీయూ అధికారుల నియామకం


నియామక పత్రాలు అందజేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేష్‌బాబు, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలోని పలు విభాగాలకు సంబంధించిన అధికారులను మంగళవారం పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్ బాబు, అధికారులతో కలిసి నియామక పత్రాలు అందజేశారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విభాగ అధిపతిగా డాక్టర్ విజయలక్ష్మి, ఫిజిక్స్ విభాగ అధిపతిగా డాక్టర్ భాస్కర్, పొలిటికల్ సైన్స్ విభాగ అధిపతిగా డాక్టర్ కుమారస్వామి, ఇంగ్లీష్ విభాగాధిపతిగా డాక్టర్ మాలవి, ఐక్యూఎసీ డైరెక్టర్, పీజీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మధుసూదన్‌రెడ్డికి అదనంగా మైక్రోబయాలజీ విభాగ అధిపతిగా నియమించారు. అకాడమిక్ ఆడిట్‌సెల్‌డైరెక్టర్ చంద్రకిరణ్ పాల్గొన్నారు.

యూరియా తరలిస్తే కఠిన చర్యలు


మంచాలకట్టలో మరబోటు యజమానులతో వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్

పెంట్లవెల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇతర ప్రాంతాలకు యూరియా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొల్లాపూర్ మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్, పెంట్లవెల్లి మండల వ్యవసాయ అధికారి వికాస్‌లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మంచాలకట్ట కృష్ణానది తీరంలో పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మర బోటులో యూరియాను ఇతర ప్రాంతాలకు తరలించిన వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. కృష్ణానది తీరం వెంట నిఘా పెట్టామన్నారు.

అదే విధంగా పెంట్లవెల్లి సింగిల్‌విండో కార్యాలయంలో రికార్డు తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా వారు స్టాక్ రిజిస్టరు, అదే విధంగా రైతుల నుంచి సేకరించిన పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతు పొలం విస్తీర్ణాన్ని బట్టి ఒక రైతుకు గరిష్ఠంగా రెండు బస్తాల కంటే ఎక్కువ యూ రియా ఇవ్వరాదన్నారు. ఆధార్‌కార్డు, పాసు పుస్తకం లేకుండా వస్తే యూరియా ఇవ్వవద్దన్నారు.

రేపు మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణ

- హాజరుకానున్న డిప్యూటీ సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు
- విలేకరుల సమావేశంలో తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా


సమావేశంలో మాట్లాడుతున్న ఒబేదుల్లాకొత్వాల్

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ, సుదీర్ఘకాలం పాటు డీసీసీ అధ్యక్షుడిగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషిచేసిన దివంగత జగదీశ్వర్‌రెడ్డి విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించనున్నామని తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లాకొత్వాల్ అన్నారు. నగరంలోని పద్మావతికాలనీ గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లు హాజరవుతున్నారని చెప్పారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ భావజాలం, సిద్ధాంతాలకోసం అధికారంలో ఉన్నా లేకున్నా అంకితభావంతో పనిచేశారని తెలిపారు. విద్యార్థి దశనుంచే జిల్లా, రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారని గుర్తు చేసుకున్నారు. టీడీపీ హయాంలో ఈ ప్రాంత సాగు,తాగునీటి కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని, సాగునీటి ప్రాజెక్టుల కోసం పార్టీ నేతలతో కలిసి కొల్లాపూర్ నుంచి నారాయణపేట, అలంపూర్‌నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేశారన్నారు. ఈనెల 4న జరిగే విగ్రహావిష్కరణకు ముఖ్యఅతిథులతోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. నాయకులు లక్ష్మణ్‌యాదవ్, మల్లు నర్సింహారెడ్డి, సంజీవ్‌ముదిరాజ్, సిరాజ్‌ఖాద్రి, వినోద్‌కుమార్, చంద్రకుమార్‌గౌడ్, సీజె బెనహర్, గోపాల్‌యాదవ్, జహీర్ అక్తర్, రాజేందర్‌రెడ్డి, లింగంనాయక్, అజ్మత్‌అలీ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- డీఐజీ ఎల్ఎస్ చౌహాన్
- ఆత్మకూరు, మదనాపురం పోలీస్ స్టేషన్‌ల తనిఖీ


ఆత్మకూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కను నాటుతున్న డీఐజీ చౌహాన్

ఆత్మకూరు/మదనాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉంటే నేరాలు అదుపులో ఉంటాయని జోగుళాంబ జిల్లా జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా ఆత్మకూరు సీఐ కార్యాలయం మదనాపూర్ పోలీస్ స్టేషన్ కార్యాలయాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్ఐ శేఖర్ రెడ్డిలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం పోలీసు కార్యాలయంలో మొక్కను నాటారు. ఆత్మకూరు, మదనాపూర్ స్టేషన్‌ల పరిధిలోని లాకప్ రూమ్, సెంట్రీ రిలీఫ్ బుక్, రైటర్, పార్కింగ్ ప్రదేశాలు వంటి వాటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసులు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహిస్తే నేరాలు అదుపులో ఉంటాయని పోలీసులు గుర్తించాలన్నారు. అలాగే మండలాల్లోని గ్రామాలకు కేటాయించిన పోలీసులు రోజు వారీగా గ్రామాలలో పర్యటించి గ్రామ ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటేనే గ్రామ ప్రజల మంచి చెడ్డలు తెలుస్తాయన్నారు. 100 డయల్ రాగానే సంఘటన స్థలానికి చేరుకుని వారి సమస్యలు తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం వనపర్తి జిల్లాలో డీజే సౌండ్ రద్దు కొరకు పోలీసు వారు ముమ్మరంగా ప్రచారాలు నిర్వహించిన కారణంగానే డీజే సౌండ్లను విరమించుకొని భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాలు చేపట్టడం గర్వించదగ్గ విషయం అన్నారు. అలాగే పేకాట, డ్రగ్స్, పీడీఎస్ రైస్, అక్రమ ఇసుక రవాణా వంటి వాటిపై దృష్టి సారించి వాటిని నిరోధించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిబంధనలు అతిక్రమించి ఎవరైనా అక్రమంగా ఇసుక, పీడీఎస్ రైస్‌ను అక్రమంగా రవాణా చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శివకుమార్, ఎస్ఐ శేఖర్‌రెడ్డి, ఆయా పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు..?

● కంకర రోడ్లపై ప్రయాణ కష్టాలు


మామిళ్లపల్లి నుంచి జీనుకుంట వరకు రోడ్డుపై పరిచిన కంకర

ఉప్పునుంతల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడం కోసం ప్రభుత్వం లక్షల నిధులు మంజూరు చేసినా అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రయాణికులకు శాపంగా మారింది. ఉప్పునుంతల మండల పరిధిలోని మామిళ్లపల్లి నుంచి పోలేపల్లి వయా జినుకుంట వరకు నాలుగున్నర కిలోమీటర్లు బీటి రోడ్డు మర మ్మతుకు రూ.3 కోట్ల 60 లక్షల నిధులు గత జూలై 2024 మంజూరయ్యాయి. గత ఏడాది జూ లైలో కాంట్రాక్టర్ హడావుడిగా పనులు ప్రారంభించి నాలుగున్నర కిలో మీటర్లు రోడ్డుపై కంకర పరిచారు. ఏడాది గడుస్తున్నా నేటికీ రోడ్డు వైపు కాంట్రాక్టర్ కన్నెత్తి చూడకపోవడంతో ప్రయాణికులు ఈ మార్గం ద్వారా ప్రయాణం చేయాలంటే నరక యాతన పడుతున్నామని పలువురు వాపోతున్నారు. మామిళ్లపల్లి, రామగిరి, దాసర్లపల్లి తదితర గ్రామాల ప్రజలకు అచ్చంపేటకు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు.

ఈ గ్రామాల ప్రజలకు అచ్చంపేటకు రావాలంటే ఈ మార్గం ద్వారా వస్తే సుమారు 10 కిలో మీటర్లు వరకు దూరం దగ్గుతుందన్నారు. ఉప్పునుంతల మీదుగా అచ్చంపేటకు రావాల్సి వస్తే 10 కిలో మీటర్లు దూరం పెరగడంతో పాటు ఖర్చు అధికం అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కంకర పరిచి ఏడాది కావస్తున్నా పాలకులు కాని అధికారులు కాని పట్టించుకున్న పాపాన పోలేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని పలువురు తెలిపారు.

● **కాంట్రాక్టర్ పనులు చేయడం లేదు**

చేసిన పనులకు ప్రభుత్వం నుంచి కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు చేయడం లేదు. ఈ విషయం ఉన్నతాధికారులు ఎమ్మెల్యే దృషికి తీసుకెళ్లినా తర్వలో బీటీ రోడ్డు పనులు పూర్తి చేసే విధంగా కృషి చేస్తాం.

- మహేష్ పీఆర్ ఏఈ

కంకర రోడ్డును బీటీగా మార్చేందుకు ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నరకాన్ని తలపిస్తున్న రహదారి..


గుంతలమయంగా మారిన కల్వకోల్ నుంచి తీర్నాంపల్లికి వెళ్లే రహదారి

పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని కల్వకోల్ గ్రామపంచాయతీ తీర్నాంపల్లికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారి నరకాన్ని తలపిస్తున్నది. పెద్దకొత్తపల్లి మండలం నల్లమల అటవీ ప్రాంత సమీపంలో ఉన్న తీర్నాంపల్లి గ్రామానికి వెళ్లాలంటే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కల్వకోల్ నుంచి దాదాపు 5కిలో మీటర్ల దూరంలో గల తీర్నాంపల్లి గ్రామానికి వెళ్లాలంటే గతుకుల రోడ్డుపై ప్రయాణం చేసి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రహదారి బాగు చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రూ. లక్షా పదహారు వేలు పలికిన వినాయక లడ్డూ


లడ్డూను దక్కించుకున్న నాగరాజు కుటుంబ సభ్యులు

కొత్తకోట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కనిమెట్ట గ్రామంలోని యాదవ కమ్యూనిటీ హాల్ వద్ద కృష్ణ యాదవ యూత్ ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూ వేలం పాటల్లో రూ.లక్షా పదహారు వేలు పలికింది. మంగళవారం వినాయకుని నిమజ్జనానికి తీసుకెళ్తున్న సందర్భంలో వేలం నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన నాగరాజు రూ.లక్షా పదహారు వేలు పాడి లడ్డూను దక్కించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ


వనపర్తి జిల్లా కేంద్రంలో గణనాథుడి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆర్యవైశ్యులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు గణనాథుడి పల్లకీ సేవ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాన్ని పుర వీధులలో వైభవంగా ఊరేగించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని తిరిగి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఉంచారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము, యువజన సంఘం అధ్యక్షుడు బచ్చు వెంకటేష్, మహిళా సంఘం అధ్యక్షురాలు పిన్నం వసంత, నరేందర్, మంజుల, ఉమా, భాగ్యలక్ష్మి, గోవింద్, కిషోర్, మహేష్, వెంకటేష్, బచ్చు భరత్, చిన్ను, ప్రశాంత్, శ్రీకాంత్, ఆర్యవైశ్య సంఘం పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్‌లో

మెరిసిన ఉదయ సిద్ధార్థ


విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

పెద్దమందడి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు యూనివర్సిటీలో ఆగస్టు 30,31 తేదీలలో నిర్వహించిన 11వ తెలంగాణ జూనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌లో కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ కళాశాల విద్యార్థి ప్రతిభ చాటారు. యూజీ మొదటి సంవత్సరం విద్యార్థి ఉదయ సిద్ధార్థ అండర్-20 షార్ట్ పుట్ విభాగంలో వనపర్తి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య, అధ్యాపక బృందం తోటి విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ క్రీడా రంగంలో రాణించిన విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుంటారన్నారు. ఉద్యాన కళాశాలలో చదువుతో పాటు ఆటల పోటీలు ఇతర కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఓఎస్ఏ డాక్టర్ శంకర్, స్వామి, షహనాజ్, గౌతమి, శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ మహేష్‌లు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి భజన పోటీల విజేత కురుమూర్తి

చిన్నచింతకుంట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిన్నచింతకుంట మండల కేంద్రంలోని బాలగంగాధర్ తిలక్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి భజన పోటీల్లో కురుమూర్తి గ్రామ వీర హనుమాన్ భజన మండలికి చెందిన భజన పరులకు మొదటి బహుమతి దక్కింది. అదే విధంగా ద్వితీయ బహుమతి శివరామాంజనేయ భజన మండలికి, తృతీయ బహుమతి అంజనేయస్వామి భజన మండలికి(చౌదర్‌పల్లి) లభించింది. 4వ బహుమతి అభాంజనేయస్వామి భజన మండలి (పిన్నంచర్ల) గ్రామ భజన భక్తులు దక్కించుకున్నారు. 5వ బహుమతి రామాంజనేయ భజన మండలి(దుపల్లి) వారు, అదేవిధంగా ఉత్తమ తబలిస్టుగా వీరభద్ర భజన మండలి వారు బహుమతులను గెలుపొందారు. అదే విధంగా ఉత్తమ డోలకులుగా దుపల్లి గ్రామానికి చెందిన దత్తాత్రేయ భజన మండలి వారు బహుమతిని కైవసం చేసుకున్నారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా దుపల్లి శ్రీరాములు, గౌరయ్యస్వామి, తదితరులు వ్యవహరించారు.

ఈ కార్యక్రమానికి భజన పోటీల్లో పాల్గొన్న భజన మండలి భక్తులకు బహుమతులను అందించారు. భజన భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఎంపీటీసీ మాజీ సభ్యుడి అరెస్టు

ధరూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూరులో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు కురువ దుబ్బన్నను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ కొండా శ్రీహరి మంగళవారం విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కురువ రామాంజనేయులు సోమవారం తన పొలానికి వెళ్తుండగా, మార్గంమధ్యలో కాపుకాచిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు కురువ దుబ్బన్న అతడిపై గడ్డపారతో దాడి చేయడతో తలపై తీవ్రగాయమైందన్నారు. దాడికి పాత కక్షలే కారణమని ఎస్‌ఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, విచారణ అనంతరం, కురువ దుబ్బన్నను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మండలంలోని బొందలపల్లి గ్రామానికి చెందిన దండు మాసయ్య సోమవారం గ్రామ శివారులో గొర్రెలను మేపేందుకు వెళ్లాడు. పక్కనే ఉన్న మొక్క జొన్న చేనుకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ ప్రాంతంలో గొర్రెలు మేస్తుండటం, మనుషులు కనిపించకపోవడంతో చుట్టుపక్కల రైతులు మాసయ్య కుమారుడికి ఫోన్ చేసి చెప్పడంతో, అతడు వచ్చి గొర్రెలను మేపుకొని ఇంటికి తీసుకెళ్లాడు. తండ్రి కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం మళ్లీ అ ప్రాంతంలోని చేన్లలో వెతకగా, మాసన్న మృతదేహం కనిపించింది. సంఘటనపై అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వానరాల దాడిలో యువకుడికి తీవ్ర గాయాలు


కోతుల దాడిలో గాయపడిన ఖురైషీ అబ్దుల్లా

మద్దూర్, సెప్టెంబర్2 (ఆంధ్రజ్యోతి) : వానరాల దాడిలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. నారాయణపేట జిల్లా, మద్దూరులో మంగళవారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన ఖురైషీ అబ్దుల్లా అనే వ్యక్తి తన ఇంటి ముందున్న అరుగుపై కూర్చొని ఉండగా వానరాలు కాంపౌండ్ మీదుగా ఇంట్లోకి వచ్చాయి. వాటిని వెళ్లగొట్టేందుకు అబ్దుల్లా కేకలు వేశాడు. దీంతో కోతులు అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కోతులు తరుచూ దాడులు చేస్తున్నాయని, అధికారులు స్పందించి వాటిని బంధించి ఊరి బయటకు తరలించాలని కోరారు.

బొంకూరులో కుక్కల దాడి..

అలంపూరుచౌరస్తా (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని బొంకూరులో వీధి కుక్కలు దాడి చేయడంతో నలుగురు గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రుఖ్మత్‌బాషా, వడ్డె రమేశ్, పరమేశ్, ఊషన్నలు మంగళవారం కాలి నడకన వస్తుండగా వీధికుక్కలు వెంబడించి కరిచాయి. తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు.

ద్విచక్రవాహనం దహనం

మానవపాడు, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు ఉంచిన ద్విచక్ర వాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలంలోని కొర్విపాడుకు చెందిన కుర్వ మద్దిలేటి ఈనెల 31న ఉదయం ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు ఉంచి గొర్రెలను మేపేందుకు వెళ్లాడు. అతడి భార్య పొలం పనికి వెళ్లింది. సాయంత్రం తిరిగి ఇద్దరూ తిరిగి వచ్చే సారికి బైక్ పూర్తి కాలిపోయి కనిపిచిఇంది. సంఘటనపై బాధితుడు మంగళవారం మానవపాడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ జమీరుద్దీన్ తెలిపారు.

నిడ్జింతలో క్షుద్ర పూజల కలకలం


నిడ్జింత వాగులో క్షుద్ర పూజల ఆనవాళ్లు

కొత్తపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండలంలోని నిడ్జింత వాగులో క్షుద్ర పూజలు కలకలం సృష్టించాయి. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన కొంతరు యువకులు వాగు పరిసరప్రాంతాలకు వెళ్లారు. వారికి దీర్ఘ చతురాస్రాకారంలో ముగ్గు వేసి, అందులో బొమ్మలు, దీపాలు ఉంచి, కుంకుమ్మ, పసుపుతో పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించడంతో గ్రామస్థులకు సమాచారం అందించారు. ఈ సంఘటనతో చుట్టు పక్కల రైతులు ఆందోళనకు గురయ్యారు.

పింఛన్ల పంపిణీకి ముఖ గుర్తింపు

» బ్రాంచి పోస్ట్ మాస్టర్లకు మొబైల్ ఫోన్లు » వనపర్తి జిల్లాలో 73 మందికి అందజేత


సవాయిగూడెంలో ఫేషియల్ రికగ్నిషన్ నమోదు చేస్తున్న బీపీఎం

వనపర్తి రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత (చేయూత) కింద లబ్ధిదారులకు ప్రతీ నెల పింఛన్లు పంపిణీ చేస్తోంది. కొన్ని గ్రామాల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుండగా, మరి కొన్ని గ్రామాల్లో బ్రాంచి పోస్ట్ మాస్టర్ల (బీపీఎం) ద్వారా పెన్షన్లను అందజేస్తున్నారు. వనపర్తి జిల్లాలోని 15 మండలాల పరిధిలో 255 గ్రామ పంచాయతీలున్నాయి. అందులో 99 గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పెన్షన్లు జమ చేస్తున్నారు. 156 గ్రామ పంచాయతీలో బీపీఎంల ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. గతంలో లబ్ధిదారుల వేలి ముద్రలు తీసుకొని పింఛన్లు ఇచ్చేవారు. అయితే కొందరు లబ్ధిదారుల వేలిముద్రలు స్పష్టంగా లేకపోవడం, సరిగా నమోదు కాకపోవడంతో సమస్యలు ఎదురవుతుండేవి. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్) విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. అందుకోసం బీపీఎంలకు మొబైల్ ఫోన్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా వనపర్తి జిల్లాలోని 73 మంది బీపీఎంలకోసం ఆండ్రాయిడ్ 5జీ మొబైల్‌ఫోన్‌లను డీఆర్‌డీవో కార్యాలయానికి అందించారు. సంబంధిత అధికారులు బీపీఎం వివరాలు, వారికి ఇచ్చిన ఫోన్ ఈఎంఐ నెంబర్‌ను నమోదు చేసుకొని 10 రోజుల క్రితం వారికి ఇచ్చారు. ఈ ఫోన్‌లో లబ్ధిదారుల ముఖ గుర్తింపు నమోదుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను పొందుపరిచి ఉంటుంది. ఇదే ఫోన్‌కు వెనుక వైపు లబ్ధిదారుల వేలి ముద్రల నమోదు యంత్రం కూడా ఉంటుంది. బీపీఎం పేరున ఇచ్చిన ఫోన్ ఈఎంఐ నెంబర్‌ను డీఆర్‌డీఏ కార్యాలయంలో సిబ్బంది ఆన్‌లైన్లో నమోదు చేసి వారికి అందించారు.

71 వేల మంది లబ్ధిదారులు

వనపర్తి జిల్లాలో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, డయాలసిస్ పేషెంట్లు, హెచ్‌ఐవీ బాధితులు మొత్తం 71 వేల మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రతీ నెల ఫింఛన్లు ఇస్తోంది. దివ్యాంగులకు రూ.3,016, మిగతా వారికి రూ.2,016 అందజేస్తోంది. పింఛన్ల పంపిణీలో అక్రమాలకు ఆస్కారం లేకుండా, లబ్ధిదారులకు సజావుగా అందించాలనే లక్ష్యంగా గత నెల నుంచి ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని అమలు చేస్తోంది. ఫోన్‌లో యాప్ ద్వారా లబ్ధిదారుల ముఖగుర్తింపు నమోదు చేసుకొని పింఛన్ అందజేస్తున్నారు.

నెట్‌వర్క్ సమస్యతో ఇబ్బంది

లబ్ధిదారులకు పింఛన్లు సకాలంలో, సజావుగా అందించేందుకు ముఖ గుర్తింపు విధానాన్ని అమలు చేస్తుండగా, కొన్ని సార్లు నెట్‌వర్క్ అంతరాయంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా ఒక లబ్ధిదారుడికి పింఛన్ ఇచ్చేందుకు దాదాపు అరగంట సమయం పడుతుందని బీపీఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కార్యాలయానికి రాలేని దివ్యాంగులు, వృద్ధులకు సంబంధించి వారి కుటుంబంలో ఒకరికి గ్రామ కార్యదర్శి అనుమతితో పింఛన్లు ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ కొత్త విధానం ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి వేలిముద్ర, ముఖ గుర్తింపు తీసుకొని పింఛన్లు ఇవ్వాల్సి వస్తోంది. దీంతో ఎక్కువ సమయం అవుతోందని వారు చెప్తున్నారు.

ఇంటింటికి వెళ్లడం ఇబ్బంది

అబ్దుల్ సమి, బీపీఎం, పామిరెడ్డిపల్లి :



మంచానికి పరిమితమైన వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి ముఖ గుర్తింపు, వేలి ముద్రల ద్వారా పింఛన్లు ఇవ్వడం ఇబ్బందిగా మారింది. ఒక్కోసారి లబ్ధి దారుడి వేలిముద్ర, ముఖగుర్తింపు నమోదు కావడం లేదు. దీంతో ఆలస్యం అవుతోంది. పింఛన్ల పంపిణీతో పాటు, పోస్టమాన్ విధులతో పని భారం పెరిగింది.

వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

» వనపర్తి జిల్లాలో క్రమంగా తగ్గుతున్న డెంగీ కేసులు » డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లే శ్రీనివాసులు


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసులు, చిత్రంలో వైద్యులు రంగారావు

వనపర్తి వైద్యవిభాగం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సమర్థవంతంగా కట్టడి చేయగలమని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని తెలిపారు. జిల్లాలో గత ఐదేళ్లుగా డెంగీ వ్యాధి కేసుల సంఖ్య క్రమంగా తగ్గుతోందన్నారు. 2021లో 306 పరీక్షలు చేస్తే, 106 (33 శాతం) పాజిటివ్ కేసులు వచ్చాయని చెప్పారు. 2022లో 134 మందికి పరీక్షలు చేస్తే, 42 (31 శాతం) పాజిటివ్ కేసులు, 2023లో 65 పరీక్షలకు 19 (21 శాతం) పాజిటివ్ కేసులు, 2024లో 24,120 పరీక్షలకు గాను, 143 (0.59 శాతం) పాజిటివ్ కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 7,262 మందికి పరీక్షలు చేయగా, 49 (0.38 శాతం) డెంగీ కేసులు నమోదైనట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రస్తుతం 17,652 డెంగీ కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కిట్ మెథడ్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చినంత మాత్రం డెంగీ ఉన్నట్లు కాదని తెలిపారు. ఎలిజా పరీక్షల్లో పాజిటివ్ వస్తేనే వ్యాధి వచ్చినట్లు గుర్తించాలన్నారు. ప్రజలు భయాందోళనకు గురి కాకుండా, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు, వైద్యులు సుమిత్ రెడ్డి, రవి పాల్గొన్నారు.

తండాలకు నిధులు కేటాయించాలి

» మంత్రిని కోరిన నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి


మంత్రి అడ్లూరి లక్ష్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కోరారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం ఆయనను కలిసి వినతిపత్రం ఇచ్చి, సమస్యలను వివరించారు. నారాయణపేట నియోజవవర్గంలో గ్రామ పంచాయతీల నుంచి గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు రూ.10 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ధన్వాడలోని ఎస్సీ హాస్టల్ శిథిలావస్థకు చేరుకున్నదని, కొత్త భవనం మంజూరు చేయాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి, త్వరలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

» ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, తెలంగాణ చౌరస్తాలో బైఠాయింపు


మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో బైఠాయించిన విద్యార్థినులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్ పట్టణంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, భరత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ. 8,250 కోట్ల స్కాలర్‌షిప్పులు, రీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్పులు రాకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరారు. జిల్లాలో పలు గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. వాటికి వెంటనే సొంత భవనాలు నిర్మించాలని కోరారు. రాస్తారోకోలో నాయకులు శ్రీనాథ్, ఈశ్వర్, సాయి, మణికంఠ, హేమలత, జ్ఞాపిక, నవ్య పాల్గొన్నారు.



బాలికపై అఘాయిత్యం

» యువకుడిపై పోక్సో కేసు

చిన్నంబావి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు చిన్నంబావి ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. వనపర్తి జిల్లా, చిన్నంబావి మండలంలోని ఓ గ్రామంలో 16 ఏళ్ల బాలికపై ఈ నెల 27న ఓ యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పని బాలిక మంగళవారం కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన వరద

- 75,309 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో - గేట్ల మూసివేత
- జూరాలకు 1.26 లక్షల క్యూసెక్కుల వరద

గద్వాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతోంది. మంగళవారం ప్రాజెక్టులోకి 75,309 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. గేట్లను మూసివేశారు. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 66,273 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 199.73 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 54 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 50 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 52 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 35 వేల క్యూసెక్కులు అవుట్‌ఫ్లో ఉన్నది. భీమా నదిపై గల సన్నతి బ్యారేజీ అవుట్‌ఫ్లో 40 వేల క్యూసెక్కులు ఉన్నది. జూరాలకు 1.26 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 10 గేట్లను ఎత్తి 69,630 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 36,674 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 75 వేలు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 71 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

అన్నదాత ఆగ్రహం

» యూరియా కోసం రాస్తారోకోలు
» మద్దతు పలికిన బీఆర్‌ఎస్ నాయకులు
» పోలీసు బందోబస్తు మధ్య పంపిణీ
» మిగిలిన రైతులకు టోకెన్లు అందజేత

తిమ్మాజిపేట/తిమ్మాజీపేట/బిజినేపల్లి/హన్వాడ/దేవరకద్ర/ జడ్చర్ల/ ఖిల్లాఘణపురం/ గోపాల్‌పేట/ గద్వాల/ అమరచింత, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పీఏసీఎస్‌ల వద్ద పొద్దస్తమానం ఎదురుచూపులతో విసిగి వేసారి ఆందోళన బాట పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు మంగళవారం పలుచోట్ల రాస్తారోకోలు చేపట్టారు.

- నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట మండల కేంద్రంలో రైతులు గంట పాటు రాస్తారోకో చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడారు. అందరికీ ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

- బిజినేపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో రైతులు రాస్తారోకో చేశారు. స్థానిక ఎస్‌ఐ కె.శ్రీనివాస్ వారికి నచ్చచెప్పడంతో రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమించారు.

- మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండల కేంద్రంలోని సొసైటీ వద్ద తెల్లవారుజామున 4 గంటల నుంచే రైతులు బారులు తీరారు. వర్షంలోనూ అక్కడే ఉండి ఎదురుచూశారు. యూరియా ఇప్పుడే రాదని సిబ్బంది చెప్పడంతో 6 గంటల సమయంలో తండూర్ - మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. బీఆర్‌ఎస్ మండల నాయకుడు శ్రీనివాసులు వారికి మద్దతు తెలిపారు. సాయంత్రం యూరియా వస్తుందని సిబ్బంది చెప్పడంతో రాస్తారోకో ఆందోళన విరమించి, సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు మూడు లారీల యూరియా వచ్చింది. ఎస్‌ఐ వెంకటేశ్, సిబ్బంది, ఏవో కిరణ్‌లు బారికేడ్లు ఏర్పాటు చేసి వరుస క్రమంలో రైతులకు యూరియా పంపిణీ చేయించారు.

- దేవరకద్ర కొత్త బస్టాండ్ వద్ద అంతర్జాతీయ రహదారిపై రైతులు, మహిళలు రాస్తారోకో చేపట్టరు. ఎస్‌ఐ నాగన్న, వ్యవసాయాధికారి రాజేందర్ అగర్వాల్ రైతులతో మాట్లాడారు. అందరికీ టోకెన్లు ఇస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

- జడ్చర్ల మునిసిపాలిటీలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం - 2 వద్ద రైతులు దాదాపు గంట పాటు ధర్నా చేశారు. వారికి బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. మరి కొందరు రైతులు ఆగ్రో కేంద్రం సమీపంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకొని, ఎమ్మెల్యేకు సమస్యను వివరించారు. దీంతో ఆయన ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడారు. యూరియా లోడ్‌తో వస్తున్న గూడ్స్ రైలు రావడం ఆలస్యమైందని చెప్పారు. సాయంత్రంలోగా వస్తుందని నచ్చచెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.

- గద్వాల గద్వాల పీఏసీఎస్ కార్యాలయం ముందు తెల్లవారక ముందే రైతులు క్యూలైన్‌లో బారులు తీరారు. యూరియా రాకపోవడంతో ఓపిక నశించిన రైతులు చెప్పులను క్యూలైన్‌లో ఉంచి, అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. డీఎస్పీ మొగిలయ్య, సీఐ శ్రీను, ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ రంగంలోకి దిగి రైతులకు సర్దిచెప్పి, యూరియా టోకెన్లను పంపిణీ చేయించారు. సాయంత్రం మూడు లారీలలో 1,350 బస్తాల యూరియా వచ్చింది. టోకెన్లు తీసుకున్న రైతులకు యూరియా పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

- వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద వందలాది మంది రైతులు ఉదయం 5 గంటల నుంచే బారులు తీరారు. 10 గంటల సమయంలో కార్యాలయం షెట్టర్ తెరవడంతో రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో కొంత తోపు లాట జరిగింది. అక్కడే ఉన్న ఎస్‌ఐ వెంకటేశ్, సిబ్బంది వారిని అదుపు చేయడానికి శ్రమించాల్సి వచ్చింది. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటల వరకు 750 బస్తాల యూరియా పంపిణీ చేశారు. మిగిలిన రైతులకు ఈ నెల 14 వరకు టోకెన్లు ఇచ్చారు.

- గోపాల్‌పేట మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయం వద్దకు ఉదయం నుంచే రైతులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. చెప్పులు, పాస్‌బుక్కులను వరుసగా పెట్టి ఎదురు చూశారు. పోలీసుల సాయంతో రైతులకు యూరియా పంపిణీ చేశారు.

- అమరచింత మండల కేంద్రంలోని ఆగ్రో సేవా కేంద్రం వద్దకు రైతులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. వారితో పాటు కొత్తగా టోకెన్లు తీసుకునేందుకు రైతులు వచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ స్వాతి అక్కడికి చేరుకున్నారు. రైతులందరినీ హై స్కూల్ మైదానంలోకి పంపించారు. గేటు వద్ద నిలబడి వరుస క్రమంలో ఒక్కో రైతులకు టోకెన్లు అందించారు.



తిమ్మాజిపేట మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న రైతులు



హన్వాడ ప్రాథమిక సహకార కేంద్రం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా వచ్చింది

- జడ్చర్ల రేక్ పాయింట్‌కు చేరుకున్న 1,500 మెట్రిక్ టన్నులు
- పాలమూరు, నాగర్‌కర్నూల్, పేట జిల్లాలకు కేటాయింపు
- పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే, వ్యవసాయ అధికారులు


జడ్చర్ల రేక్ పాయింట్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ విజయేందిరబోయి

జడ్చర్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల రైల్వే రేక్ పాయింట్‌కు మంగళవారం 1,500 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. ఉదయమే రావాల్సిన గూడ్స్ రైలు ఆలస్యంగా మధ్యాహ్నం వచ్చింది. రైల్వేస్టేషన్‌లోని రేక్ పాయింట్ వద్దకు చేరుకున్న యూరియాను కలెక్టర్ విజయేందిరబోయి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వెంకటేశ్, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పరిశీలించి అధికారులతో మాట్లాడారు. వచ్చిన యూరియాలో మహబూబ్‌నగర్ జిల్లాకు 450, నాగర్‌కర్నూల్ జిల్లాకు 650, నారాయణపేట జిల్లాకు 300 మెట్రిక్ టన్నులు కేటాయించారు. 100 మెట్రిక్ టన్నులు కమిషనర్ రిజర్వ్ పూల్‌లో ఉంచారు. గూడ్స్ వేగన్ల నుంచి యూరియా అన్‌లోడింగ్ ప్రక్రియను ప్రారంభించారు. అన్‌లోడింగ్ పూర్తయిన తరువాత జిల్లాల వారీగా యూరియాను పంపించనున్నారు. కేటాయించిన మూడు జిల్లాలకు బుధవారం ఉదయం యూరియా చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

మహబూబ్‌నగర్ జిల్లాకు కేటాయించిన 450 మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లాలోని 29 కేంద్రాలకు పంపించనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి తెలిపారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. అవసరమైన మేర జిల్లాకు చేరుకుందని చెప్పారు.

ఇంటర్వ్యూ..

గణేశ్ నిమజ్జనంలో నిబంధనలు పాటించాలి

- మహేశ్‌గౌడ్, ఎస్ఐ, వంగూరు



వంగూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వినాయక నిమజ్జనంలో నిబంధనలు పాటించాలని, ఎవరికీ ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ మహేశ్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు పేర్కొన్నారు.

డీజేలకు అనుమతి ఉందా ?

గణేశ్ విగ్రహాల ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదు. గ్రామాల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి క్రమపద్ధతిన సంబంధిత చెరువు, కుంటలో నిమజ్జనం చేయాలి

నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

వినాయక విగ్రహాలఊరేగింపు సమయంలో సంయమనం పాటించాలి. గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటాం. ఇందుకు ముఖ్యంగా ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు సహకరించాలి.

ఉత్సవాల నిర్వాహకులకు మీరిచ్చే సూచనలు ఏమిటి ?

మండపాల నిర్వాహకులు నియమ నిష్టలతో ఉండాలి. మద్యపానం ఇతర మత్తుపదార్థాలు సేవించరాదు. నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై ఎలా స్పందిస్తారు ?

స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో సమస్యలను తెలుసుకొని వారి నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదు స్వీకరిస్తాం. ప్రజలతో స్నేహభావంగా మెలుగుతాం.

న్యూస్ బాక్స్

గ్రామాల్లో భారీ వర్షం

తాడూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు పాపగల్, ఐతోల్, సిర్సవాడ, భలాన్‌పల్లి, గోవిందాయపల్లి, ఎట్టిదార్‌పల్లి, అంతారం తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఇప్పటికే నిరంతర వర్షాలతో ఆందోళన చెందుతున్న అన్నదాతలకు మంగళవారం కురిసిన వర్షంతో పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతింటాయని ఆవేదన చెందుతున్నారు.

కక్షసాధింపునకు పాల్పడుతున్న ప్రభుత్వం : బీఆర్‌ఎస్‌వీ

వెల్దండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు జంగిలి యాదగిరి ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగితే శాస్త్రీయంగా నిరూపించాలని, బీఆర్‌ఎస్ అధినేతపై అవినీతి మరకలంటిస్తూ సీబీఐ విచారణ పేరుతో అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో నాయకులు కొండల్‌యాదవ్, పోలే అశోక్, జంగిలి ప్రసాద్, శేఖర్, రఘుగౌడ్, శ్రీను, బాలకృష్ణ, గణేష్, సైదులు, మల్లేష్, దశరథం, అన్వర్, రాజు, రమేష్, జహీర్ ఉన్నారు.

నూతన గ్రామ పంచాయతీకి స్థల పరిశీలన

తాడూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్సవాడ గ్రామంలో నూతనంగా మంజూరైన గ్రామ పంచాయతీ భవనానికి మంగళవారం పంచాయతీ రాజ్ ఏఈ శివకృష్ణ ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించి కొలతలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం ఉపాధి హామీ పథకం ద్వారా రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయని, పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కేశ అల్లోజీ, బుద్ధారం మల్లయ్య, కారోబార్ మల్లేష్, రమేష్ తదితరుల ఉన్నారు.

పశువుల స్టాండ్ అందజేసిన ఎస్‌బీఐ ఫౌండేషన్

అచ్చంపేట రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి గ్రామంలో పశువుల వైద్య నిమిత్తం సులువుగా ఉంటుందనే ఉద్దేశంతో ఎస్‌బీఐ ఫౌండేషన్ తరపున స్టాండ్ ఏర్పాటు చేశారు. ఏర్పాటుకు కావాల్సిన శ్రమదానం స్థానిక యువకులు చేశారు. ఎస్‌బీఐ ఫౌండేషన్ తరపున ఉద్యోగి శేఖర్ మంగళవారం స్టాండ్ ప్రారంభిస్తూ పశువుల స్టాండ్ ప్రయోజనాలు వివరించారు. పశువుల స్టాండ్‌ను ఏర్పాటు చేసినందుకు గ్రామస్థులు ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు పనులు చేపట్టాలి : బీజేపీ

చారకొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రం నుంచి మర్రిపల్లి, రాంపురం, చంద్రాయన్‌పల్లి రోడ్డు నిర్మాణం పనులను వెంటనే చేపట్టాలని బీజేపీ మండల నాయకుడు చింతపల్లి కిరణ్‌గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గుంతల మయంగా మారడంతో ప్రయాణి కులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రం నుంచి రాంపురం, చంద్రాయన్‌పల్లికి రోడ్డుకు నిధులు మంజూరు కావడంతో అచ్చంపేట, కల్వకుర్తి ఎమ్మెల్యేలు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డిలు పనులకు భూమిపూజ చేశారని గుర్తు చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల రోడ్డు నిర్మాణం పనులు చేపట్టక పోవడంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. చేపట్టకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

పూజలందుకుంటున్న వినాయకుడు



ఉప్పునుంతల : కొరటికల్‌లో గణపతికి పూజలు చేస్తున్న ప్రజలు

కందనూలు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మైల్‌స్టోన్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు వినాయకునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి కాల నీవాసులు, వివిధ మండపాల యువక బృందం సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో దాత దాసర్ల రామకృష్ణ, పుష్పలత, దాసర్ల ఓం ప్రకాశ్, భవానీ, హరీష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నాగం శశిధర్ రెడ్డి ప్రత్యేక పూజలు

బిజినేపల్లి : మండల కేంద్రంలోని ఆనందగిరి కాలనీలోని గణపతి విగ్రహానికి సోమవారం రాత్రి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ నాగం శశిధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. దాత, బీఆర్‌ఎస్ నాయకుడు గంగనమోని కురుమయ్య ఏర్పాటు చేసిన చీరలను మహిళలకు శశిధర్‌రెడ్డి పంపిణీ చేశారు. కురుమయ్యను ఆయన అభి నందించారు.

వినాయక మండపం వద్ద అన్నదానం

మన్ననూర్ : అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణనాథుని ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర ఆలయ పాలక మండలి డైరెక్టర్ సంభు శోభ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నంది హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, సంభు వెంకట్‌రమణ, రాజారాం, రమేష్, గోపాల్, కుమార, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్వామికి ఉండ్రాళ్ల పాయసం

ఉప్పునుంతల : మండలంలోని కొరటికల్ గ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొజ్జగణపయ్యకు ఇష్టమైన ఉండ్రాళ్ల పాయసాన్ని సమర్పించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు, విశ్వాస్ ఆసుపత్రి ఎండీ గోపిరెడ్డి రఘుపతిరెడ్డి, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకుడు వెంకట్‌రెడ్డి, నాయకులు హరీశ్, శ్రీశైలం, గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు రాజు, సత్యం, అశోక్, హరిష్, నరేష్, ప్రసాద్, బన్ని, మల్లేష్ ఉన్నారు.

రైతు బాంధవుడు వైఎస్ఆర్

- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు



నాగర్‌కర్నూల్‌లో వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందనూలు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో మంగళవారం మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పుర్కరించుకొని కాగ్రెస్ నాయకులు ఘన నివాళ్లు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్, కోటయ్య, భార్గవి మాట్లాడుతూ వైఎస్ఆర్ చేసిన పథకాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. పేదల సంక్షేమానికి పాటుపడ్డారని కొనియాడారు. పాపమ్మ, సునీం ద్ర, నిజాం, నిరంజన్ పాల్గొన్నారు.

కల్వకుర్తిలో...

కల్వకుర్తి : దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ అన్నారు. కల్వకుర్తిలో వైఎస్ఆర్ వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, నాయ కులు ఎజాస్ ఉన్నారు.

రైతు బాంధవుడు వైఎస్ఆర్

అచ్చంపేటటౌన్ : రైతు బాంధవుడు వైఎస్ఆర్ అని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని రాజీవ్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, నాయకులు గోపాల్‌రెడ్డి, శేఖర్, రామనాథం, నాయకులు పాల్గొన్నారు.

● జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు.

మహిళా ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న వీవోఏ ఉద్యోగులు

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 2 (ఆంధజ్యోతి) : మహిళా ఆర్థిక అభివృద్ధి, సాధికారతే ప్రజాప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏపీఎం, సీసీలు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు, వీవోఏలతో సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతమే ఐకేపీ లక్ష్యమన్నారు. విధులు, బాధ్యతల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం నిరంతం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మంత్రి జూపల్లి పరామర్శ

కోడేరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొండ్రావుపల్లి గ్రామానికి చెందిన సోమరాజు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం పరామర్శించారని కుటుంబ సభ్యులు తెలిపారు. నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి బాధితునికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. బాధితునికి కుటుంబ సభ్యులకు మంత్రి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట కోడేరు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కొమ్మ కురుమయ్య యాదవ్, కుటుంబ సభ్యులు చిట్టెమ్మ, చెన్నయ్య ఉన్నారు.

యూరియా కోసం ఎదురుచూపులు

వెల్దండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల రైతులకు యూరియా తిప్పలు తప్పడంలేదు. ప్రస్తుతం సాగుచేస్తున్న వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు యూరియా వేసే సమయం రావడంతో ప్రతీనిత్యం సింగిల్‌విండో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆలస్యమైతే యూరియా దొరకదని భావించిన రైతులు ఉదయం ఏడుగంటల వరకే సింగిల్‌విండోకు చేరుకుని తాళం వేసిఉంచిన గేటు ఎదుటే నిరీక్షించడం మంగళవారం కనిపించింది. కాగా గత మూడురోజులుగా యూరియా నిల్వలు లేని విషయం తెలియని రైతులు పడిగాపులు కాశారు. ఆ తర్వాత రైతులు నిరాశగా వెనుదిరగడం కనిపించింది.

పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న నాయకులు

కందనూలు, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సాయిరెడ్డిలు తిరిగి రెండవసారి ఎన్నికయ్యారు. పరిశీలకులుగా సోషల్ మీడియా కన్వీనర్ శివరామ కృష్ణగౌడ్ వ్యవహరించి, మాట్లాడారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాల ని, గతంలో డిప్యూటేషన్లు ఇచ్చిన వారి స్థానం లో అక్కడ పోస్టులు భర్తీ కావడంతో తిరిగి వారిని మాతృ పాఠశాలలకు పంపాలని, ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని సూచించారు. జిల్లాలోని పీఆర్‌టీయూ తెలంగాణ నాయకులు జైపాల్‌రెడ్డి, అశోక్, శేఖర్, సుధాకర్ ఉన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న కళా ఉత్సవ్ పోటీలను మంగళవారం డీఈవో రమేష్‌కుమార్ సందర్శించి విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని నేషనల్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలను పోటీల్లో శాస్త్రీయ, సంప్రదాయ జానపద పాటల పోటీలు, శాస్త్రీయ, జానపద, నృత్య తదితర 12రకాల పోటీలు జరిగాయి. డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో కళాత్మక నైపుణ్యాలను వెలికితీసే మంచి వేదిక కళా ఉత్సవ్ అని అన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు సెప్టెంబరు 10న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. సూపరింటెండెంట్ సుజాత, ఇన్‌చార్జి ఏఎంవో కిరణ్‌కుమార్, ఎంఈవో భాస్కర్‌రెడ్డి, జీసీడీవో శోభారాణి, నేషనల్ హైస్కూల్ హెచ్‌ఎం బి.రవి పాల్గొనగా, న్యాయ నిర్ణేతలుగా ఎస్.సురేష్‌బాబు, మోహన్, చాంద్ పాషా, జి.మురళీధర్‌రావు వ్యవహరించారు.

సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలి

కోడేరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాలలో ప్రజలకు ఏఎన్ఎంలు ఆశావర్కర్లు అందుబాటులో ఉండాలని పీహెచ్‌సి డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించి వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్ అన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని మంగళవారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో మాధవికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడు తూ రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్‌షిప్‌లు విడుదల కాక పేదవిద్యార్థులు ఉన్నత విద్యకుదూరమవుతున్నారన్నారు. మూడేళ్లుగా స్కాలర్‌షిప్ విడుదల కాలేదన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ప్రవీణ్, కమిటీ సభ్యులు విజయ్, సోను, శివ, రమేష్, శిరీష, మానస, కీర్తి పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని పంచాయతీ వర్కర్ల ధర్నా

బిజినేపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ పంచాయతీ వర్కర్లు ధర్నా చేపట్టారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు రాములు, జశ్వంత్‌లు మాట్లాడుతూ మూడు నెలలు వేతనాలు చెల్లించకపోవడం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో కతలప్పకు వినతపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ శ్రీశైలం, రాము, రామకృష్ణ, కతాల్, శంకర్, కేవీపీఎస్ నాయకుడు అశోక్ ఉన్నారు.

మహిళల భద్రతపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన

మన్ననూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మన్ననూరు పీహెచ్‌సీ ఆవరణలో ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు మహిళల భద్రతపై మంగళవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. భ్రూణ హత్యలు, బాల్య వివాహాలు, డొమస్టిక్ వాయిలెన్స్ తదితర అంశాలపై సమీకృత మహిళా భద్రత సాధికారత కేంద్రం ప్రతినిధులు వెంకటమ్మ, రేణుకలు ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. మన్ననూరు పీహెచ్‌సీ, ఆయుష్ వైద్యాధికారులు డాక్టర్ సుధాకర్, డాక్టర్ జాన్సన్‌లు ఆరోగ్య సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు మారతమ్మ, రాజేశ్వరీ పాల్గొన్నారు.

తుర్కలపల్లి పాఠశాలలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం

చారకొండ, సెప్టంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుర్కలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం లింక్‌వెల్ టెలీ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంట్ కేంద్రాన్ని సంస్థ జనరల్ మేనేజర్‌లు మోహన్‌రావు, అచ్యుత్‌రెడ్డిలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు శుద్ధిచేసిన నీటిని తాగుతూ ఆరోగ్యవంతంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో సంస్థ ఆపరేషన్ మేనేజర్ రమేష్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం భగవాన్‌రెడ్డి, హెచ్‌ఎం మహిపాల్‌నాయక్ పాల్గొన్నారు.

కెమిస్ట్రీ పాఠాలు బోధించిన ఇంటర్ విద్య నోడల్ అధికారి



విద్యార్థులకు కెమిస్ట్రీ పాఠాలు బోధిస్తున్న ఇంటర్ నోడల్ అధికారి వెంకటరమణ

తాడూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తాడూరు మండలంలో గల ఎస్‌కేఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్ నోడల్ అధికారి వెంకటరమణ విద్యార్థులకు కెమిస్ట్రీ పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహణపై విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహణ చేయిస్తూ మెళకువలు, సలహాలు, సూచనలు చేశారు. విద్యార్థులు కూడా పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

పేద విద్యార్థుల చదువులకు తోడ్పాటు అందిస్తాం

- విశ్వాసి సంగతి నేషనల్ డైరెక్టర్ విజయ్ బాబ్జి

బ్రహ్మగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు విశ్వాసిసంగతి ఎప్పటికీ తోడ్పాటును అందిస్తుందని అ సంస్థ నేషనల్ డైరెక్టర్ విజయ్ బాబ్జి అన్నారు. మంగళవారం అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబావి గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలు, ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, మ్యాట్లు, చెప్పులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రీన్ సోల్ కంపెనీ సహకారంతో విశ్వాసిసంగతి సంస్థ సామాజిక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. నల్లమలలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులందరికీ బ్యాగులు, మ్యాట్లు, చెప్పులు పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వటువర్లపల్లి పాఠశాల హెచ్‌ఎం అంజిలాల్, ఉపాధ్యాయురాలు శ్రీవాణి, విశ్వాసిసంగతి సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ నాను నాయక్, ఆంజనేయులు, భయన్న, సత్యం అంగన్‌వాడీ టీచర్ పార్వతమ్మ తదితరలుఉ పాల్గొన్నారు.

సీపీవో భూపాల్‌రెడ్డి సేవలు ప్రశంసనీయం

- ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పదన్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రణాళిక విభాగంలో సీపీవో భూపాల్‌రెడ్డి సేవలు ప్రశంసనీయమనైనవని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీవో) ద్యాప భూపాల్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, సీపీవో సుజాత, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, డీఈవో రమేష్ కుమార్, అధికారులు విజయ్‌కుమార్, రాంలాల్ పాల్గొన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, అధికారులు తెలిపారు.

మునిసిపల్ శాఖ పనితీరుపై సమీక్ష

నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో అమలవుతున్న వివిధ పథకాలపై శానిటరీ ఇన్‌స్పెక్టర్, రెవెన్యూ విభాగం అన్ని విభాగాల మునిసిపల్ అధికారులు, సిబ్బంది, మునిసిపల్ కమిషనర్లు, జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయంతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, వన మహోత్సవం, వరదలు, నష్టాలు, సీజనల్ వ్యాధులు, పారిశుధ్యం, నీటి సరఫరా, రెవెన్యూ, పన్ను వసూళ్లు, భవన నిర్మాణ అనుమతి, భూమి క్రమబద్ధీకరణ పథకం, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, వీధి దీపాలు, జంతు జనన నియంత్రణ కేంద్రం, ఫిర్యాదులు పలు అంశాలపై ప్రగతిని సమీక్ష జరిపారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

- పరిశీలించిన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



నాగనూల్ చెరువు దగ్గర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి అన్నిఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. వినాయక నిమజ్జనం చేసే నాగనూల్ చెరువు దగ్గర మంగళవారం ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పట్టణంలో అన్ని వినాయక విగ్రహాలను నాగనూల్ చెరువులో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి పట్టణాల్లో మునిసిపల్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సంబంధిత నిమజ్జన ప్రదేశాలలో లైటింగ్ ఏర్పాటు, రెండు క్రేన్లు, 24 గంటలు పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లను నియమించినట్లు తెలిపారు. ఎక్కడైనా సమస్య వచ్చినట్లయితే డయల్ 100గాని, నాగర్‌కర్నూల్ పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబరు 8712657709కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కల్వకుర్తిలో డీఎస్పీ పరిశీలన

కల్వకుర్తి : వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణలో జరుపుకోవాలని కల్వకుర్తి డీఎస్పీ సైరెడ్డి వెంకటరెడ్డి కోరారు. కల్వకుర్తి పట్టణంలోని ఎర్రకుంటను మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, కల్వకుర్తి సీఐ బి.నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డిలతో కలిసి మంగళవారం డీఎస్పీ పరిశీలించారు. కల్వకుర్తి పట్టణంలో వాడవాడలా ప్రతిష్ఠించిన గణనాథులను 9వ రోజు నిమజ్జనం చేస్తారని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

- రాష్ట్ర టెలికాం శాఖ డైరెక్టర్ శ్రీనివాస్ బహదూర్



తిమ్మాజీపేట : రేషన్ కార్డులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తిమ్మాజీపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ రేషన్ కార్డులు తప్పక వస్తాయని, ఎవరూ అధైర్యపడవద్దని రాష్ట్ర టెలికాం శాఖ డైరెక్టర్ శ్రీనివాస్ బహదూర్ అన్నారు. తిమ్మాజీపేట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు మద్దతు ఇవ్వాలని కోరారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవులు, మాజీ ఎంపీటీసీ లీలావతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉస్మాన్, రవూఫ్, దేవస్వామి, మల్లేష్, సురేందర్, ముబారక్, బాబా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కల్వకుర్తి : ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ అన్నారు. కల్వకుర్తిలోని 6, 7వ వార్డుల్లో లబ్ధిదారులకు రేషన్‌కార్డులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణఅధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, చిన్నరాంరెడ్డి, సైదులుయాదవ్, శేఖర్, కేశవులు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సెకండ్ ఏఎన్ఎంల ఆందోళనలో సీఐటీయూ నాయకుడు శంకర్‌నాయక్

బల్మూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రెండవ ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ముందు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శంకర్ నాయక్ మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో వైద్య, ఆరోగ్య సేవలందిస్తున్న రెండవ ఏఎన్ఎమ్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్రంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండవ ఏఎన్ఎమ్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. కార్యక్రమంలో సావిత్రి, పద్మ, తిరుపతమ్మ, సీత, యాదమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం చెల్లించాలి

అమ్రాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతంలో పేద ప్రజలకు ప్రభుత్వం వైద్యం అందించడంలో సహాయకులుగా పని చేస్తున్న ఆశావర్కర్లకు గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ.18 వేల వేతనం అందించి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్. మల్లేష్ మంగళవారం అమ్రాబాద్‌లో విజ్ఞప్తి చేశారు. వర్కర్ల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఆశా వర్కర్ల సంఘం బాధ్యులు నారమ్మ, గాయత్రి, నిర్మల, పద్మ, రాములమ్మ, గ్రేసమ్మ పాల్గొన్నారు.

అకారణంగా దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి

- మీ సేవా సంఘం సభ్యుల డిమాండ్



అదనపు కలెక్టర్ అమరేందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మీ సేవ నిర్వాహకులు

బల్మూరు, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మీసేవ కేంద్రంపై దాడికి పాల్పడి ఫర్నిచర్, కంప్యూటర్లను ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మీ సేవ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో రాత్లావత్ శక్రునాయక్, మీ సేవ కేంద్రం నడుపుకుంటున్నాడు. మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన దేశ్యా నాయక్‌కు శక్రునాయక్ కొంత అప్పు ఉన్నాడు. అప్పు అడిగేందుకు సోమవారం బల్మూరుకు వచ్చిన దేశ్యా నాయక్‌కు, మీసే కేంద్రంలో ఉన్న శక్రునాయక్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. దేశ్యా నాయక్ గొడవపడి కంప్యూటర్లు, లాప్‌టాప్‌లపై దాడి చేసి ధ్వంసం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీకాంత్‌తో పాటు జిల్లా అడిషనల్ కలెక్టర్ అమరేందర్‌కు ఫిర్యాదు చేసినట్లు సంఘం సభ్యులు తెలిపారు.

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

- రెండవ రోజుకు భూ నిర్వాసితుల దీక్షలో వ్యకా.సం.జిల్లా కార్యదర్శి పి.నరసింహా



తీగలపల్లిలో రెండో రోజు రిలే నిరాహార దీక్ష చేస్తున్న భూ నిర్వాసితులు

కోడేరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో తీగలపల్లి గ్రామంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.నరసింహ కోరారు. మండల పరిధిలోని తీగలపల్లి గ్రామంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని చేపట్టిన రైతుల రిలే నిరాహార దీక్షలు రెండవ రోజుకు చేరుకున్నాయి. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.నరసింహ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి భూ నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్ర మంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు, భూ నిర్వాసితులు రాములు, చిన్నరాములు, పబ్బతి స్వామి, ఫాతిమా, బుజ్జమ్మ, లక్ష్మయ్య పాల్గొన్నారు.